క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పేరెల్లి అంజయ్య శనివారం మృతిచెందారు. దీంతో ఆదివారం అతడి మృతదేహానికి డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిబాబు, నవీన్, వెంకన్న, ఉప్పలయ్య, నాగరాజు, యాదగిరి, ఎలేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

నాగారం : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఫ్రెండ్స్ యువజన క్రీడాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు దందోలు యాదగిరి అన్నారు. మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు ఆదివారం బహుమతి ప్రదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యులు నవీన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న హమాలీలు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన మామిడి రంగమ్మ, కె.రేణుకలు ఇటీవల మృతి చెందారు. దీంతో స్థానిక హమాలీ సంఘం ఆధ్వర్యంలో క్వింటా చొప్పున బియ్యాన్ని మృతుల కుటుంబాలకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు సాయిని కృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు బైరు రాంబాబు, కార్యదర్శి కొమారి మహేష్, సాయిని రాము, మల్లయ్య, నాగరాజు, చంద్రయ్య, నర్సయ్య, నాగరాజు, వీరభద్రం, వెంకన్న పాల్గొన్నారు.

మాలధారుల పూజలు


పూజలు చేస్తున్న మాలధారులు

అర్వపల్లి : హనుమాన్ జయంతి సందర్భంగా 41రోజుల దీక్షలో భాగంగా జాజిరెడ్డిగూడెంలో హనుమాన్ మాలధారులు ఆదివారం స్థానిక భక్తబాలాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజనల కార్యక్రమాన్ని జరిపారు. కుంభం వెంకన్న అనే భక్తుడు మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హుజూర్‌నగర్‌రూరల్ : లక్కవరం గ్రామానికి చెందిన ఇలసాగరపు ఆదినారాయణ నాలుగేళ్లుగా పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనర్సింహ యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొట్టెముక్కల నరసింహ, కీత చందరావు, రాము, వెంకటేశ్వర్లు, గోపి, నవీన్, చందు, విజయ్, యాదగిరి పాల్గొన్నారు.

పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం


విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పందిరి ఫౌండేషన్ సభ్యులు

మునగాల: 25ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన రెణబోతు అప్పిరెడ్డి పలువురికి ఆదర్శప్రాయుడని పందిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పందిరి నాగిరెడ్డి కొనియాడారు. ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెణబోతు అప్పిరెడ్డి ఇటీవల పదవీ విరమణ చేయడంతో పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థినికి అభినందన..

మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రెణబోతు రిషిత పదో తరగతి పరీక్షల్లో 10/10జీపీఏ సాధించడంతో ఆదివారం పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ పందిరి కళావతి, పనస నాగేశ్వరరావు, ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, సభ్యులు నర్రా శ్రీపాల్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి


తిరుమలగిరిలో పోలింగ్ సామగ్రితో వచ్చిన ఎన్నికల సిబ్బంది


అర్వపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద సామగ్రితో సిబ్బంది, పోలీసులు


తుంగతుర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారెడ్డి

తిరుమలగిరి : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరుగనుంది. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 13 పోలింగ్ కేంద్రాల్లో 12324 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుమలగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్నది. తిరుమలగిరి మండలంలో 1692 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1129 మంది, మహిళలు 414 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు రమణారెడ్డి, సుధ పరిశీలించారు.

అర్వపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్వపల్లిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రానికి ఆదివారం ఎన్నికల సామగ్రి చేరింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో పోలింగ్‌కు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని 1,302 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రంలో తగు వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ దొంతిరెడ్డి ఝాన్సీ, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : శాసన మండలి పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 1,519 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగారం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు స్థానిక తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, 1,088 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్‌కు ఒక పీఓ, ఇద్దరు ఏపీఓలు, ముగ్గురు ఓపీఓలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెన్‌పహాడ్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెక్టార్ అధికారి కవిత తెలిపారు. మండల వ్యాప్తంగా 2034 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 1405 మంది పురుషులు, 729 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18మంది అధికారులు రెండు బూత్‌లలో విధులు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పెరిక రవీందర్, ఆర్‌ఐలు స్వప్న, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెక్టార్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఆదివారం సామగ్రిని తరలించి మాట్లాడారు. నూతనకల్ మండల వ్యాప్తంగా 1335 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో 945మంది పురుషులు, 390మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్, ఎస్‌ఐ జె. సైదులు, పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


నాగారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


నూతనకల్ : ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న అధికారులు


పెన్‌పహాడ్‌లోని పోలింగ్ కేంద్రంలో సామగ్రితో ఎన్నికల సిబ్బంది

ప్రజలు సహకరించాలి

నాగారం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించవద్దని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గ్రామాల్లో గుంపులుగా తిరగరాదని, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.

బీసీ 'ఏ'లో చేర్చాలి

నాగారం : ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలని ముదిరాజ్ హక్కుల పోరాట సమితి మండల నాయకుడు బైరబోయిన శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు రాజకీయాలలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీలో కొనసాగించడం వలన అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపల చెరువులను ముదిరాజ్‌లకే అప్పగించాలని, కాంట్రాక్టర్లకు అప్పగించడంతో ముదిరాజ్‌లు ఉపాధిని కోల్పోతున్నారని అన్నారు. ఆయనతో పాటు ముదిరాజ్ హక్కుల పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్నకు గోపాలమిత్రల సంఘం మద్దతు

అర్వపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు జిల్లా గోపాలమిత్రల సంఘం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆల్దాస్ లింగయ్య తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో గోపాలమిత్రలకు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఈ ప్రభుత్వంలో కూడా తమకు గుర్తింపు ఉంటుందని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తూ తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. తమతో పాటు తాము సేవలందించే అందరి మద్దతును కూడగట్టి మల్లన్నకు ఓట్లేసి గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సురేందర్, ఉపేందర్, లక్ష్మయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ కార్యకర్తను కోల్పోయాం

ఆత్మకూరు (ఎస్) : నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆత్మకూరు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ నల్లగొండ పార్లమెంటు సోషల్ మీడియా కో కన్వీనర్ కొప్పుల క్రాంతి రెడ్డి సంతాప సభను ఆదివారం నెమ్మికల్ గ్రామంలో నిర్వహించారు. క్రాంతిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంకినేని మాట్లాడారు. కార్యకర్తలే బీజేపీకి మూల స్తంభాలని అన్నారు. కుటుంబ సభ్యుడిలా ఉండే క్రాంతిరెడ్డి మృతిచెందడం తీరని లోటని తెలిపారు. ఆయన వెంట నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర నాయకుడు మాదగోని శ్రీనివాస్ గౌడ్, చల్లా శ్రీలత రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఆత్మకూరు మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సంకినేని, సైదిరెడ్డి, తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తిరుమలగిరిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యా మందిర్‌లో 2003–04 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సంకెపల్లి విక్రమ్‌రెడ్డి, దిలీప్, యాదగిరి, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాస్, రాములు, బీరయ్య, భిక్షం, వెంకటేశ్వర్లు, లక్ష్మణ శర్మ పాల్గొన్నారు.

వీరన్న వర్ధంతి సభ కరపత్రాల ఆవిష్కరణ

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లిలో ఈ నెల 31వ తేదీన నిర్వహించే మారోజు వీరన్న వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చామకూర నర్సయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారత దేశంలో ఉందన్నారు. మూడు దశాబ్దాల క్రితమే కుల వ్యవస్థ నిర్మూలనకు మారోజు వీరన్న పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బహుజన శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దడిపల్లి వెంకట్, గుండు వెంకన్న, బుక్కరాజు తిరుపతి, నల్లడ మాధవరెడ్డి, గుండాల సందీప్, దుర్గం సైదులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మృతులకు ఎమ్మెల్యే సామేల్ నివాళి

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన అమీర్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో అమీర్ భౌతికకాయాన్ని ఆదివారం తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, సుంకరి జనార్దన్, రాము గౌడ్, ఖలీమ్‌పాషా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన సూరారపు నరేష్ భార్య మహేశ్వరి మృతి చెందింది. దీంతో శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆ గ్రామానికి వెళ్లి మహేశ్వరి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, మండడి పూర్ణచంద్రారెడ్డి, గంగదెరి శ్రీనివాస్, ఉదయ్, నాయకులు ఉన్నారు.

నాగారం : పసునూర్ గ్రామానికి చెందిన నరాల బుచ్చమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలి భౌతికకాయాన్ని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్, పంది శ్రీనివాస్, ఆకుల ప్రతాప్, శోభన్‌బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : కొమ్మాలలో నివాళులర్పిస్తున్న సామేల్


నాగారం : పసునూర్‌లో..

బెల్లి లలితకు ఘన నివాళి

నడిగూడెం : తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి బెల్లి లలిత 25వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్, నాయకులు నమృత్, సతీష్, రాహుల్, రోహిత్, నికిత్, యశ్వంత్, వీరబాబు, నిఖిల్, ఐశ్వర్, పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

సూర్యాపేట : విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, పేదరికాన్ని నిర్మూలించవచ్చని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద, మధ్యతరగతి యాదవ కుటుంబాల విద్యార్థులను బలోపేతం చేయడానికి ప్రతి ఏడాది నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. యాదవులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. యాదవ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ పని చేస్తుందన్నారు. సూర్యాపేట జిల్లాలో ఎంతోమంది యాదవులకు ఉపయోగపడేలా భవన నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, శ్రీకృష్ణ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ రేఖ సత్యం యాదవ్, మర్యాద సైదులు యాదవ్, పోలెబోయిన నర్సయ్య యాదవ్, వజ్జె వీరయ్య యాదవ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, గొడ్డేటి సైదులు యాదవ్, చలపతిరావు, రాము యాదవ్, వర్రె సుధాకర్ యాదవ్, సుంకరబోయిన వెంకన్న యాదవ్, భిక్షం యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

నిర్వహణ లేక అస్తవ్యస్తంగా హైవే

- ముగిసిన కాంట్రాక్టు గడువు
- వరుస ఎన్నికలతో టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం
- వాహనాలు ఢీకొని ధ్వంసమవుతున్న రెయిలింగ్, మీడియన్‌లు


అర్వపల్లిలో జాతీయ రహదారిపై సంత ఎదుట లారీ ఢీకొని ధ్వంసమైన రెయిలింగ్


రామన్నగూడెంలో..

అర్వపల్లి : మండల పరిధిలోని 365బీ జాతీయ రహదారి నిర్వహణ సరిగాలేక అస్తవ్యస్తంగా తయారైంది. ఈ రోడ్డు నిర్వహణ చూసే కాంట్రాక్టర్ గడువు శాసనసభ ఎన్నికలకు ముందే పూర్తయ్యింది. కానీ కొత్త కాంట్రాక్టర్ నియామకం జరగలేదు. దీంతో హైవే నిర్వహణ కొరవడింది. వరుసగా ఎన్నికల కోడ్‌లు వస్తుండటంతో కొత్త కాంట్రాక్టుకు టెండర్ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. వాహనాలు ఢీకొనడంతో హైవేపై పలుచోట్ల రెయిలింగ్, మీడియన్ ధ్వంసమయ్యాయి. అలాగే సెంట్రల్ లైట్ల స్తంభాలు కూడా ఎక్కడికక్కడ విరిగిపోతున్నాయి.

రామన్నగూడెం, అర్వపల్లి, తిరుమలగిరిలో..

సూర్యాపేట–జనగామ హైవేపై రామన్నగూడెం, అర్వపల్లి, తిరుమలగిరిలలో రోడ్డు మధ్య మీడియన్‌లు నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైట్లను బిగించారు. అయితే రాత్రి వేళల్లో వాహనాలు ఢీకొనడంతో రామన్నగూడెం, అర్వపల్లిలలో చాలా వరకు రెయిలింగ్ ధ్వంసమైంది. అలాగే సెంట్రల్ లైట్ల స్తంభాలు కూడా ధ్వంసమవుతన్నాయి. హైవే నిర్వహణ చూసుకునేవారు లేకపోవడంతో సెంట్రల్ లైట్లు కూడా సరిగా వెలగని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో వీటికి పంచాయతీ నిధులతో చిన్నచిన్న మరమ్మతులు చేస్తున్నప్పటికీ తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. గ్రామ పంచాయతీలు నిధుల లేమితో పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించలేకపోతున్నారు. హైవే నిర్వహణ చూసే కాంట్రాక్టర్ నియామకం జరిగితేనే సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. ఇప్పటికైనా హైవే విభాగం ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ నియామకాన్ని వెంటనే చేపట్టాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

రెయిలింగ్ ధ్వంసమైంది



365 హైవేపై రామన్నగూడెంలో ఏర్పాటు చేసిన రెయిలింగ్, మీడియన్‌లు ఎక్కడికక్కడ ధ్వంసమవుతున్నాయి. సెంట్రల్ లైట్లు కూడా వెలగడం లేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలి.

– వజ్జె సాయి, రామన్నగూడెం

టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉంది



సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారి నిర్వహణ చూసే కాంట్రాక్టర్ గడువు ఇటీవల ముగిసింది. అయితే ఎన్నికల కోడ్‌ల మూలంగా కొత్తగా టెండర్ ప్రక్రియ జరగడానికి ఆటంకం ఏర్పడుతోంది. కాంట్రాక్టర్ లేక రోడ్డు నిర్వహణ ఇబ్బందిగా మారింది. కాంట్రాక్టర్ లేకున్నా కొన్ని సమస్యలను పరిష్కరిస్తున్నాం.

– డి.బాలునాయక్, ఎన్‌హెచ్ విభాగం డీఈఈ

ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10లీటర్ల సారా, రెండు ద్విచక్రవాహనాలు, 45లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మట్టంపల్లి మండలం కొత్తదొనబండతండా గ్రామానికి చెందిన బానోత్ రంగా, బానోత్ సోముడు హనుమంతులగూడెం నుంచి కొత్త దొనబండతండాకు రెండు ద్విచక్రవాహనాలపై సారా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10లీటర్ల నాటుసారా, 100కేజీల బెల్లం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదే విధంగా హుజూర్‌నగర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓబెల్టుషాపులో 45లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, రవికుమార్, నవీన్, గోపిరెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వీఓలకు యూనిఫామ్ బాధ్యతలు


యూనిఫామ్ కుడుతున్న మహిళా సంఘ సభ్యులు

పెన్‌పహాడ్ : ఓ వైపు ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి.. మరో వైపు మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీఓ సభ్యులకు చేతినిండా పని కల్పించింది. ఇప్పటి వరకు ఎలాంటి పని లేకుండా టైలరింగ్‌లో నైపుణ్యం ఉండి ఖాళీగా ఉన్న వీఓ సభ్యులకు బృహత్తర పనిని ప్రభుత్వం అప్పగించింది. విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలు గ్రామ సమైఖ్య సంఘ మహిళలకు అప్పగించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 52ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2337 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారు 30 మంది గ్రామ సమైఖ్య సంఘ మహిళలు యూనిఫామ్ కుట్టేందుకు ముందుకొచ్చారు.

కొలతల వారీగా కుట్టాలి



పాఠశాలల యూనిఫామ్ కొలతల వారీగా కుట్టాలి. యూనిఫామ్ కుట్టు పనిలో నిర్లక్ష్యం వద్దు. ఐకేపీ సీసీలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. నిర్ణీత సమయంలోగా యూనిఫామ్ అందించాలి.

– నకిరేకంటి రవి, ఎంఈఓ

5వ తేదీలోగా అందిస్తాం



ఇప్పటికే వీఓ సభ్యులు యూనిఫామ్ క్లాత్‌ను ఎమ్మార్సీ నుంచి తీసుకున్నారు. యూనిఫామ్‌లు కుట్టడం మొదలు పెట్టారు. జూన్ 5లోగా విద్యార్థులకు యూనిఫామ్ అందించాలనే లక్ష్యం పెట్టుకున్నాం.

– అజయ్ నాయక్, ఏపీఎం